Bandi Sanjay Kumar, M.P
President

Bharatiya Janata Party
Telangana

# బహిరంగ లేఖ

తేది: 12.09.2021

**గౌరవనీయులైన శ్రీ కె. చంద్రశేఖరరావు గారికి**
తెలంగాణ ముఖ్యమంత్రి
ప్రగతి భవన్, హైదరాబాద్.

నమస్కారం.

**విషయం:- సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ వినతి.**

17 సెప్టెంబర్.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలు సాకారమైన రోజు. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలకు పర్వదినమైన తెలంగాణ విమోచన కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించకపోవడం అత్యంత బాధాకరం. ఎంఐఎం కనుసైగల్లో కొనసాగుతున్న మీ ప్రభుత్వం వారికి ఎక్కడ కోపం వస్తుందనే భయంతో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా నాలుగు కోట్ల ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారు.

తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17ను సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం జరుపుకోవడం నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. అంత ప్రాధాన్యత గల తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గతంలో రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, తెలుగుదేశం, ప్రస్తుతం పరిపాలిస్తున్న మీ నేతృత్వంలోని టీఆర్ఎస్ పార్టీ పట్టించుకోకపోవడంతో నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల గుండెలు గాయపడుతున్నాయి. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా కనీసం ఇప్పటికైనా నిర్వహించాలని కోరడానికే బీజేపీ తెలంగాణ శాఖ తరఫున మీకు ఈ లేఖను రాయడం జరుగుతోంది.

మలిదశ తెలంగాణ ఉద్యమకాలంలో సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాలను అధికారికంగా ఎందుకు నిర్వహించరని మీరు, టీఆర్ఎస్ పార్టీ ఊరూ, వాడా ప్రచారం చేశారు. మీరు అధికారంలోకి వచ్చి ఏడు సంవత్సరాలు కావొస్తుంది. ఈ ఏడు సంవత్సరాల్లో మీకు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలనే సోయే లేదు. రజాకార్లు, ఖాసీం రజ్వీ వారసులైన మజ్లిస్ పార్టీ నేతలకు ఎక్కడ ఆగ్రహం



☎ Off : 040-24653535, 24653311, Fax : 040-24653929, E-mail : bjptgonline@gmail.com
Off : Dr. Shyamprasad Mukkherjee Bhavan, Opp. Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.
M.P Off : # 2-10-1525, Jyothinagar, Karimnagar - 505 001, E-mail : bandisanjayindian@gmail.com

వస్తుందనే ఉద్దేశంతో తెలంగాణ విమోచన దినోత్సవం గురించి ఎక్కడా కనీసం ప్రస్తావన కూడా మీరు కాని, మీ పార్టీ వారు కానీ చేయడం లేదు. ఇదే సందర్భంలో మీకు మరొక్క విషయాన్ని గుర్తు చేయదల్చుకున్నాను. మొదటిదశ, మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో మజ్లిస్ పాత్ర నామమాత్రమే. వాస్తవానికి వారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడడాన్ని వ్యతిరేకించారు.

గత ఏడు సంవత్సరాలుగా బీజేపీ తెలంగాణ శాఖ తరఫున సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని, మలి దశ ఉద్యమంలో మీరు దీనిపైన చేసిన ప్రకటనలను ఎప్పటికప్పుడు మీకు గుర్తు చేస్తూ, ప్రతి సంవత్సరం మీకు వినతి పత్రాలు పంపడం, మీడియా ద్వారా విజ్ఞప్తి చేయడం జరుగుతూనే ఉంది. అయితే, మీకు మా విన్నపాలు, నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షలు మీకు వినబడడం లేదు.

ఈ సందర్భంగా తెలంగాణ విమోచన చరిత్రను మీ దృష్టికి తీసుకుని వచ్చి కనీసం ఇప్పటికైనా కళ్లు తెరిచి అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తారనే ఆశతో తెలంగాణ విమోచన చరిత్ర వివరాలను మీ దృష్టికి తీసురాదలిచాము.

1947 ఆగష్టు 15న భారత దేశ ప్రజలు అందరు జాతీయ జెండాలను ఆవిష్కరించుకొంటూ, వందల సంవత్సరాల పరాయి పాలన నుండి విముక్తి పొందామని స్వేచ్ఛా వాయువులు పీల్చుకొంటూ, సంబరాలు జరుపుకొంటున్న సమయంలో దేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ రాజ్యంగా పేర్కొనే ప్రస్తుత తెలంగాణ ప్రాంతంలో మాత్రం ప్రజలు నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోయిన విషయం మీకు తెలియనిది కాదు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 15 ఆగస్ట్, 1947 నాడు వరంగల్‌లో జాతీయ జెండాను ఎగరవేసిన మొగులయ్య అనే దేశభక్తుడిని తుపాకీతో కాల్చి చంపడం ద్వారా ఎవరైనా జాతీయ జెండా పట్టుకున్నా, స్వతంత్రం అనే మాట పలికినా అదే గతి పడుతుందనే హెచ్చరికలను నిజాం సర్కారు హుకుం జారీ చేసింది. భారతదేశంలో విలీనం కావలసిందే అని నినదిస్తున్న స్థానిక ప్రజలను నిరంకుశంగా అణచివేశారు.

నిజం నవాబు పాకిస్థాన్ నిర్మాత జిన్నాతో సంబంధాలు కొనసాగించాడు. హైదరాబాద్ సంస్థానంలోని హిందువులను తరిమికొట్టడానికి తన పోలీసు బలగాలకు తోడు ప్రైవేట్ రజాకార్ల సైన్యాన్ని ఏర్పాటు చేశాడు. దేశం నడిబొడ్డుపై మరో పాకిస్తాన్‌ను నిర్మించాలని ప్రయత్నించాడు. నిరంకుశ నిజాం నవాబు కబంద హస్తాల నుండి తెలంగాణను విముక్తి చేయడం కోసం ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారు. ఉక్కు మనిషి, అప్పటి ఉప ప్రధాని, కేంద్ర హోంమంత్రి శ్రీ సర్దార్ వల్లభాయ్ పటేల్ చేపట్టిన **"ఆపరేషన్ పోలో"** ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్ని నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఆయన సాకారం చేశారు.

భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలు ఉన్నాయి. అందులో తెలంగాణ విమోచన పోరాటం దేశ చరిత్రలోనే ప్రత్యేకమైనది, అత్యంత ముఖ్యమైనది. 15 ఆగస్ట్, 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, నాటి నిజాం నిరంకుశ పాలనలో ఉన్న హైదరాబాద్‌కు, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రానికి 17 సెప్టెంబర్ 1948న స్వాతంత్ర్యం పొంది విముక్తి పొందిన విషయం జగద్విదితమే.

స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం సంస్థానంలో భాగంగా 5 మరాఠా జిల్లాలు, 3 కన్నడ జిల్లాలు ఉండేవి. నిజాం సంస్థానం నుండి తెలంగాణ విముక్తి పొందిన తర్వాత ఆయా రాష్ట్రాల్లో అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. అటువంటిది వందలాది మంది ప్రస్తుత తెలంగాణ ప్రాంతనికి చెందిన మహనీయులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణలో అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహించకపోవడం అత్యంత బాధాకరం.

గత కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు చేసిన తప్పిదాలు కనీసం ఇప్పటికైనా మీ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం సరిచేసి అధికారికంగా సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ తెలంగాణ శాఖ తరఫున కోరుతున్నాం.

గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు రజాకార్లు, ఖాసీం రజ్వీకి వారసులైన మజ్లిస్ పార్టీకి భయపడి, వారి ఓట్ల కోసం సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి నిరాకరించాయి. వారి బాటలోనే గత ఏడు సంవత్సరాలుగా మీరు కూడా కొనసాగుతున్నారు. మీ పార్టీ గుర్తు అయిన కారు స్టీరింగ్ రజాకార్లు, ఖాసీం రజ్వీ వారసులైన మజ్లిస్ పార్టీ నేతల చేతుల్లో ఉంది.

ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వాలు అధికారికంగా సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోనచన దినంగా జరపకపోయినా బీజేపీ ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ వాడవాడలా మన జాతీయ జెండాను ఎగురవేసి ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరుపుతోంది.

అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా తెలంగాణ విమోచన కోసం పోరాడిన వెయ్యి మందిని ఉరితీసిన **నిర్మల్‌లోని వెయ్యి ఉడీల మర్రి** వద్ద బీజేపీ తెలగాణ శాఖ తరఫున బహిరంగ సభను నిర్వహించి ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించడానికి తలపెట్టాం.

బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ తరఫున తెలంగాణ విమోచన దినోత్సవానికి సంబంధించి కొన్ని ప్రధానమైన డిమాండ్లను మీ ముందు ఉంచుతున్నాం. దయచేసి రజాకార్లు, ఖాసీం రజ్వీ వారసులైన మజ్లిస్ కబంద హస్తాల నుండి, సుడో సెక్యులర్ వాదుల భావాల నుండి బయటపడి ఈ డిమాండ్లను వెంటనే ఆమలు చేస్తారని ఆశిస్తున్నాం.

- సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా ప్రకటించి, రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కోరుతున్నాం..

- తెలంగాణ విమోచన స్ఫూర్తి కేంద్రం నిర్మాణానికి స్థలం కేటాయించి, కేంద్ర ప్రభుత్వం అందించనున్న ఆర్థిక సహాయంతో వాటి నిర్మాణం చేపట్టాలి.

- తెలంగాణ విమోచన స్ఫూర్తి కేంద్రాన్ని యుద్ధ ప్రాతిపదికన 2022 నాటికి నిర్మాణం పూర్తి చేయాలి.

- తెలంగాణ విమోచన ఉద్యమం సందర్భంగా రజాకార్ల చేతిలో బలైన వారి కుటుంబాలను అధికారికంగా ప్రభుత్వం సన్మానం చేయాలి, వారిని ఆదుకోవాలి.

- తెలంగాణ విమోచన పోరాట చరిత్రను, ఆ ఉద్యమంలో పాల్గొన్న మహనీయుల చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి.

- తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఆ ఉద్యమంలో పాల్గొన్న వారిని సత్కరించాలి.

- రజాకార్లను తరిమి కొట్టిన వీరబైరాన్‌పల్లి, వరంగల్ కోట, రేణికుంట, కడవెండి, కామారెడ్డిగూడెం, పర్కాల, సూర్యాపేట, బీబీ నగర్, బాలెంల – పెరుమాండ్ల సంకీస తదితర ప్రాంతాలతో పాటు, తెలంగాణ విమోచనోద్యమ ఘట్టాలను పరిరక్షించాలి.

**"భారత్ మాతా కీ జై..."**

**బండి సంజయ్ కుమార్, ఎంపీ**
అధ్యక్షులు, బీజేపీ, తెలంగాణ రాష్ట్ర శాఖ